క్లుప్తంగా

220 మొక్కల వితరణ



ఆవులదట్ల ఉన్నత పాఠశాల మైదానంలో మొక్కలను నాటుతున్న కల్కిసేవా సమితి సభ్యులు

గుమ్మఘట్ట: రాయదుర్గం మండలంలోని ఆవులదట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు కల్కి మానవ సేవాసమితి ఆధ్వర్యంలో 220 టేకు,వేప,సీతాఫలం, జువ్వి, రాగి మొక్కలను వితరణ చేసినట్లు హెచ్ఎం విజయభారతి, పీడీ శివశరణ తెలిపారు. నైతిక విలువలు.యోగా, పర్యావరణంపై విద్యార్థిలకు తెలియచేసినట్లు వారు తెలిపారు. పాఠశాలకు మొక్కలను అందించడంతో సభ్యులను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు జయంతి రమేష్‌బాబు, కేకేటీ లత, శ్రీధరఘట్ట శ్రీలలిత, కేకేటీ సృజన, వినోద్ , ఉపాధ్యాయులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వంటావార్పుతో మున్సిపల్ కార్మికుల నిరసన



రాయదుర్గం : వంటావార్పుతో నిరసన తెలుపుతున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం ముందు వంటావార్పుతో సోమవారం నిరసన తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ హాజరయ్యారు. యూనియన్ అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించని పక్షంలో ఈనెల 17న ×చలో విజయవాడ× నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక కార్మిక యూనియన్ నాయకులు తిప్పేరుద్ర, నరసింహులు, ఇస్మాయిల్, శీనప్ప, ఓబన్న, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ వద్ద ఎమ్మార్పీఎస్ నాయకుల ఆందోళన



శెట్టూరు పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించిన ఎమ్మార్పీఎస్ నాయకులు.

శెట్టూరు: మాకొడికి గ్రామంలో పీర్లచావిడిలోకి వెళ్లిన దళితులపై దాడి చేసిన వారిపై వెంటనే కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆందోళన చేశారు. సోమవారం సాయంత్రం పోలీస్ స్టేషన్ వద్ద రోడ్డుపై బైఠాయించారు. దాడికి పాల్పడిన వారిపై వెంటనే కేసు నమోదు చేయాలని నినాదాలు చేశారు. బాధితుడు గంగాధరతో కలిసి ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షుడు టైలర్ వన్నూరుస్వామి, మండల అధ్యక్షుడు గౌరయ్య, నాయకులు ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ దాడి జరిగినా పోలీసులు కేసు నమోదని అన్నారు. స్థానిక ఎస్ఐ రాంభూపాల్ కల్పించుకొని ఆందోళనకారులకు సర్దిచెప్పారు. కార్యక్రమంలో మారెప్ప, గంగాధర, మహేష్, బాబు, వన్నూరప్ప, తప్పేస్వామి, వన్నూరుస్వామి, లోకమ్మ, గీతమ్మ, వన్నూరమ్మ, గౌరప్ప, శివ, మైలారి, వినోద్, అంబేడ్కర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విరబూసిన బ్రహ్మకమలాలు



గోనబావిలో పుష్పించిన బ్రహ్మ కమలాలు

గుమ్మఘట్ట: మండలంలోని గోనబావి గ్రామంలో పోగునూలు రంగస్వామి ఇంటి ముందున్న పెరట్లో సోమవారం రాత్రి బ్రహ్మకమలాలు విరబూశాయి. ఒకే చెట్టుకు ఎనిమిది బ్రహ్మ కమలాలు పూశాయి.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో మంచి అవకాశాలు

అనంతపురం: కేంద్ర మానవ వనరుల, క్రీడా మంత్రిత్వ శాఖతో గుర్తింపు పొందిన హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో మంచి అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిషనర్ తుంగ శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. యోగా, మెడిటేషన్, డ్రిల్, ఆత్మరక్షణ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, సేవా కార్యక్రమాలు, స్వచ్ఛ భారత్, క్లీన్ అండ్ గ్రీన్, పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు, మెడికల్ క్యాంపుల్లో పాల్గొంటే ఉన్నత విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు వర్తిస్తాయన్నారు. హిందూస్తాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పేరిట ఎవరైనా అక్రమంగా డబ్బులు వసూలు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. 2023లో జేఎన్‌టీయూ అనంతపురంలోనూ చౌడికి కృష్ణ అనే వ్యక్తి ఉద్యోగాలు ఇప్పిస్తామని అక్రమంగా నిరుద్యోగుల వద్ద నగదు వసూలు చేశాడనే అంశంపై ఏఐఎస్ఎఫ్ నాయకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో మూలకు చేరిన ఈ-ఆటోలు

మూలన పడిన ఈ- ఆటోలు

రాయదుర్గం: రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలోని తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేరుచేసి, డంపింగ్‌యార్డుకు తరలించాలనే లక్ష్యంతో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.38 లక్షలతో కొనుగోలు చేసిన తొమ్మిది ఈ-ఆటోలు మూలకుచేరాయి. వాటి సేవలు వినియోగించుకోక నిరుపయోగంగా ఉన్నాయి. పట్టణంలోని 32 వార్డుల్లో 75 వేల మంది జనాభా ఉన్నారు. సుమారు 114 మంది పారిశుధ్య కార్మికులు రోజూ 27 టన్నులు చెత్త సేకరిస్తున్నారు. మున్సిపాల్టీ పరిధిలో చెత్త తరలించే వాహనాలు 12 ఉంటే తొమ్మిది ఈ-ఆటోలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కొనుగోలు చేశారు. ఓ ఏజెన్సీకి వీటి బాధ్యత అప్పగించి, వాటిని నిర్వహించారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక.. వాటిని మూలకు పడేశారు. వాటిని వినియోగించుకోకపోవడంతో మరమ్మతులకు గురవుతాయని, ప్రజాధనం దుర్వినియోగమవుతుందని ప్రజలు అంటున్నారు.

ప్రతిపాదనలు పంపాం



ఈ-ఆటోలు మరమ్మతులకు గురయ్యాయి. వాటి మరమ్మతులకు అవసరమయ్యే ఖర్చులు లెక్కించి, నిధులు మంజూరు కోసం ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేయించి రోడ్డుమీదకి తీసుకొస్తాం. తప్పక ఆ వాహనాలను వినియోగంలోకి తెస్తాం.

– దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

పశువుల మంద.. పాదచారుల పాట్లు



రాయదుర్గంలోని వినాయక సర్కిల్లో తిష్టవేసిన పశువుల మంద

రాయదుర్గంటౌన్: పట్టణంలోని అనేక ప్రాంతాల్లో గుంపులుగా పశువుల సంచారంతో వాహనదారులు, పాదచారులు పాట్లు పడుతున్నారు. ప్రధాన రోడ్లతోపాటు ఇటీవల వీధుల్లో సైతం పశువుల సంచారం అధికమైంది. పశువుల యజమానులు పాలు పిండుకొని వాటిని వీధుల్లోకి వదిలేస్తున్నారు. దీంతో అవి రోడ్లపై పడి ఉన్న వ్యర్థాలను తింటూ తిరుగుతున్నాయి. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద నుంచి వినాయక సర్కిల్, కణేకల్లు రోడ్డు, బళ్లారి రోడ్డు, కూరగాయల మార్కెట్ వద్ద గుంపులుగా తిష్టవేస్తున్నాయి.దీనికితోడు ట్రాఫిక్ సమస్య కూడా తలెత్తుతోంది. పశువులను గోశాలలకు తరలించడంతోపాటు రోడ్లపై వదులుతున్న యజమానులపైనా చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

అమలుకాని హామీలతో కూటమి మోసం

కుందుర్పి: అమలు కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. ఏడాదిగా రైతులకు ఏ ఒక్క సంక్షేమ పథకమూ అమలు చేయలేదని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. సోమవారం కుందుర్పిలో ఎంపీపీ కమలానాగరాజు, మండల కన్వీనర్ హనుమంతరాయుడు, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు తిప్పేస్వామి, మండలపల్లి భీమప్ప, కుందుర్పి సర్పంచ్ భర్త రామూర్తి, ఐటీ వింగ్ జిల్లా సభ్యులు నరేష్, వార్డు సభ్యులు మంజు తదితరులు విలేకరులతో మాట్లాడారు. రైతులకు పెట్టుబడి సాయం కింద ఒక్కో రైతుకు రూ.20 వేలు ఇస్తామన్న సీఎం చంద్రబాబు.. ఖరీఫ్ సీజన్ వచ్చినా రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. మరోవైపు పంట నష్టపరిహారం కాని,పంటల బీమా కాని ఇవ్వకుండా మోసం చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పంట రుణాల తీసుకున్న రైతులకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించేదని ప్రస్తుతం రైతులే ప్రీమియం చెల్లించాల్సిన దుస్థితి నెలకొందన్నారు.

జంబుకేశ్వరుడికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో జంబుకేశ్వరస్వామి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన స్వయంభూ జంబుకేశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని అర్చకులు రామకృష్ణస్వామి ఆధ్వర్యంలో స్వామి మూలవిరాట్‌కు పూలతో అలంకరణ చేశారు. పంచామృతాభిషేకం, ఏకబిల రుద్రాభిషేకం, కుంకుమార్చన చేశారు. భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

పరమేశ్వరుడికి పాలాభిషేకం



పార్వతీపరమేశ్వరులకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

కూడేరు: కూడేరులో ప్రసిద్ధిగాంచిన పార్వతీ పరమేశ్వర జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు పార్వతీ పరమేశ్వర్లకు పాలాభిషేకం, రుద్రాభిషేకం చేశారు.

మురుగుతున్న ముదిగల్లు



ముదిగల్లు సచివాలయం వద్ద మురుగు ఇలా..

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు ప్రధాన రోడ్లపై నిత్యం మురుగునీరు పారుతోంది. స్వర్ణాంధ్ర – స్వచ్ఛతా హిసేవ కార్యక్రమాల పేరుతో అధికారులు హడావుడి చేశారేగానీ .. ఎక్కడా పరిశుభ్రతకు చేసిందేమీలేదని గ్రామస్తులు అంటున్నారు. వార్డు సచివాలయానికి రోజూ పదుల సంఖ్యలో ప్రజలు వివిధ సమస్యలు, పథకాల అప్‌డేట్ తెలుసుకునేందుకు వస్తుంటారు. వచ్చిన వారంతా మురుగునీటిని దాటుకొని వెళ్లాల్సి వస్తోంది. దీనికితోడు గ్రామంలో అపరిశుభ్రతతో దోమల బెడద అధికమైందని గ్రామస్తులు ంటున్నారు.

పచ్చని చెట్లు నరికివేత



పూలకుంట గ్రామ సమీపంలో పచ్చని చెట్లను నరికివేసిన దృశ్యం

గుమ్మఘట్ట: మండలంలోని పూలకుంట సమీపంలో రోడ్డు కిరువైపులా పెంచిన పచ్చని చెట్లను నరికివేశారు. గతంలో ఉపాధిహామీ పథకంలో గుమ్మఘట్ట నుంచి గోనబావి, పూలకుంట,75 వీరాపురం , బీటీపీ లేఅవుట్ వరకు రోడ్డు కిరువైపులా రూ.లక్షలు వ్యయం చేసి రోడ్డు కిరువైపులా కానుగ, వేప,రావి మొక్కలు నాటారు. చెట్లపైన విద్యుత్ తీగలకు అంతరాయం కలుగుతుందని పచ్చని చెట్లను నరికివేశారు.

‘పీఎస్‌పీవీ’ అర్జీలు వెంటనే పరిష్కరించండి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఆర్డీఓ వసంతబాబు



బ్రహ్మసముద్రం తహసీల్దార్ సుమతికి వినతి పత్రం అందిస్తున్న గ్రామస్తులు

• అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహర్

కూడేరు: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను పూర్తి స్థాయిలో విచారణ చేసి, రెవెన్యూ రికార్డుల మేరకు వెంటనే పరిష్కరించాలని అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహర్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన కూడేరు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ మహబూబ్ బాషా, డీటీ ఉదయ్ భాస్కర్, ఇతర సిబ్బందితో సమావేశమయ్యారు. భూ,ప్రజాసమస్యల పట్ల అలసత్వం వహించొద్దన్నారు. ప్రతి ఒక ఉద్యోగి ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 20 వినతులు అందాయి. అందులో భూసమస్యలు పరిష్కారానికి 15, ఇతర సమస్యలపై ఐదు ఉన్నాయి. అర్జీలను డీటీ ఉదయ్ భాస్కర్ స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, ఎంఈఓ మహమ్మద్ గౌస్ , పీఆర్ ఏఈ రమణయ్య, ఏఓ శుభకర్, ఏపీఓ పోలేరయ్య, ఈఓఆర్డీ రాధాకృష్ణ, ఏసీడీపీఓ ఎల్లమ్మ, హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై నిర్లక్ష్యం వీడండి

కళ్యాణదుర్గం: నియోజకవర్గ స్థాయిలో ప్రతి సోమవారం ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై ఆయా శాఖల అధికారులు నిర్లక్ష్యం వీడాలని ఆర్డీఓ వసంతబాబు సూచించారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల నుంచి ప్రజలు అందించిన ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. పట్టదారు పాసుపుస్తకాల కోసం, భూముల సరి హద్దుల సర్వే విషయం, ఇతర సమస్యలపై మొత్తం ఏడు అర్జీలు అందినట్లు ఆర్డీఓ తెలిపారు.

నివాస స్థలాలు ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారని..

బ్రహ్మసముద్రం : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ముద్దలాపురానికి చెందిన పలువురు తహసీల్దార్ సుమతికి సమస్యలు విన్నవించారు. వారు మాట్లాడుతూ దాదాపు 40 ఏళ్ల క్రితం అప్పటి కలెక్టర్ ఆదేశాల మేరకు వంక పోరంబోకు భూమిలో తమకు నివాస స్థలాలు మంజూరు చేశారని, కానీ కొందరు ఆ స్థలాలను ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారన్నారు. తమకు న్యాయం చేయాలని దాదాపు 43 మంది గ్రామస్తులు తహసీల్దార్‌కు విన్నవించారు. పీజీఆర్ఎస్‌లో మొత్తం పది అర్జీలు వచ్చాయి.

టమాట పంట.. ధర లేక తంట



ఎర్రగుంటలో టమాట పంటను గొర్రెలు మేస్తున్న దృశ్యం

కుందుర్పి: గిట్టుబాటు ధరలు లేక టమాట రైతు ఆందోళన చెందుతున్నాడు. పక్షం రోజులుగా బహిరంగ మార్కెట్‌లలో ధరలు లేక నష్టపోతున్నట్లు ఆవేదన చెందుతున్నారు. పొలాల్లోనే పంటను మూగజీవాలకు వదిలేస్తున్నారు. మండలం నుంచి కర్ణాటక బాగేపల్లి, కోలార్, అనంతపురం మార్కెట్లకు టమోటాలు తరలిస్తున్నారు. ప్రస్తుతం 15 కిలోల బాక్స్ రూ.60 నుంచి రూ.150 మధ్య ధర పలుకుతోందని, దీంతో రవాణా చార్జీలు కూడా రావడంలేదని ఎర్రగుంట, జంబుగుంపల రైతులు రాజన్న, సురేష్, మంజునాథ్, తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల వ్యాప్తంగా 13 గ్రామ పంచాయతీల్లో 2,600 ఎకరాల్లో టమోట సాగు చేసినట్లు హార్టికల్చర్ అధికారులు తెలిపారు. ఎర్రగుంట రైతు శంకర్‌రెడ్డి మాట్లాడుతూ తాను 3 ఎకరాల్లో రూ.1.40 లక్ష పెట్టుబడి పెట్టి టమాట పంట సాగు చేశానని, ధర లేకపోవడంతో రూ.90 వేలు నష్టం వచ్చిందన్నారు.

బీబీ పాతిమా పీర్ల జాతర ప్రారంభం

అనంతపురం కల్చరల్: బీబీ ఫాతిమా చిన్నపీర్ల జాతర సోమవారం ప్రారంభమైంది. స్థానిక 5వ రోడ్డులోని మకానం నుంచి సాయంత్రం పెట్టి మెరవణి నభాజీ భజంత్రీల నడుమ సందడిగా సాగింది. ఈనెల 20 వరకు సాగే వేడుకలకు అగ్నిగుండం ఏర్పాటు చేశారు. బీబీ ఫాతిమ బ్రహ్మోత్సవ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున మాట్లాడుతూ.. మొదటి రెండు రోజులు మకానం వద్ద నిత్య పూజలు జరుగుతాయన్నారు. 17న చిన్నసరిగెత్తు, అదేరోజు రాత్రి మెరవణి, 19న పెద్ద సరిగెత్తు, పానకాలు, 20న ఉదయం అగ్నిగుండ ప్రవేశం ఉంటాయన్నారు. 22న చివరి దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. రోజూ చక్కెర చదివింపులు ఉంటాయని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు



కూడేరు: ఎంఎంహళ్లిలో చక్కెర చదివిస్తున్న దృశ్యం



కుందుర్పిలో కొలువుదీరిన పీర్లు

కుందుర్పి: మండల కేంద్రంలో సోమవారం మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం పెద్దసరిగెత్తు సందర్భంగా కుందుర్పిలో రెండు చోట్ల పీర్లు కొలువుదీరాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పెద్ద ఎత్తున పీర్ల చావిడికి వెళ్లి ఫాతేహా పఠించారు. రాత్రికి వందలాది మంది పానకం కడవలతో వెళ్లి ఉపవాస దీక్షలు విరమించుకున్నారు. మంగళవారం తెల్లవారు జామున అగ్నిగండ ప్రవేశం, సాయంత్రం పీర్ల జలధి ఉంటుందని సర్పంచు మారుతేశ్వరి తెలిపారు.

ఎంఎంహళ్లిలో భక్తిశ్రద్ధలతో పానకాలు

కూడేరు: మండలంలోని ఎంఎంహళ్లిలో సోమవారం మొహర్రం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పీర్లస్వాములకు పానకాలు సమర్పించారు. పీర్ల చావిడిలో వన్నూరు స్వామి, కుళ్లాయి స్వామి, ఇతర పీర్లకు ముజువార్ ప్రత్యేక చక్కెర చదివింపులు చేశారు. ప్రజలు మరువలో పానకాన్ని తీసుకొచ్చి గుండం చుట్టూ ప్రదక్షిణలు చేసి, పీర్ల దేవుళ్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

దంపతులపై విరిగిపడిన చెట్టు

కళ్యాణదుర్గం రూరల్: నడిరోడ్డుపై చెట్టు విరిగి పడడంతో ద్విచక్ర వాహనంపై వెళుతున్న దంపతులు గాయపడ్డారు. వివరాలు.. శెట్టూరు మండలం బొచ్చుపల్లి గ్రామానికి చెందిన దంపతులు రామలింగ, మహాలక్ష్మి సోమవారం వ్యక్తిగత పనిపై ద్విచక్రవాహనంలో కళ్యాణదుర్గం పట్టణానికి వెళ్లారు. అక్కడ పనిముగించుకుని తిరుగు ప్రయాణమైన వారు.. పాపంపల్లి దాటగానే రోడ్డు పక్కనే ఉన్న చెట్టు ఉన్నఫళంగా ద్విచక్ర వాహనంపై విరిగి పడింది. ఘటనలో రామలింగ, మహాలక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వెళుతున్న వారు సహాయక చర్యలు చేపట్టి వారిని 108 అంబులెన్స్ ద్వారా కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురానికి వైద్యులు రెఫర్ చేశారు. ఘటనపై కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులకు సన్మానం చేస్తున్న దృశ్యం

కుందుర్పి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేస్తూ బదిలీ అయిన ఉపాధ్యాయులను స్థానిక ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం గోపీచంద్ ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ చైర్మన్ రాంబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. బదిలీపై వెళ్లిన 12 మంది ఉపాధ్యాయులను సన్మానించారు.

‘లీడర్‌షిప్’ శిక్షణ ప్రారంభం

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలు పెంపొందించే ‘లీడర్‌షిప్’ అంశంపై నాలుగు రోజుల పాటు జరిగే శిక్షణ సోమవారం ప్రారంభమైంది. బుక్కరాయసముద్రం సమీపంలోని విజయభారతి బీఈడీ కళాశాలలో జరిగిన శిక్షణను సమగ్రశిక్ష ఏపీసీ శైలజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా ఈ శిక్షణను తీసుకుందన్నారు. ప్రధానోపాధ్యాయులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని పాఠశాలల్లో అమలు చేయాలని సూచించారు. శిక్షణకు జిల్లా వ్యాప్తంగా 235 మంది ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకుడు బి.సురేష్ పాల్గొన్నారు. ఎంఈఓ-2లు గురుప్రసాద్, లింగా నాయక్ కోర్సు డైరెక్టర్లుగా వ్యవహరించారు. సమగ్ర శిక్ష ఏఎంఓ వేణుగోపాల్ శిక్షణను పర్యవేక్షిస్తున్నారు.

దళితులపై దౌర్జన్యాలు ఆపాలి

అనంతపురం: దళితులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు ఆపాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. సోమవారం ఎస్పీ జగదీష్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వజ్రకరూరు మండలం చాబాల గ్రామంలో మొహర్రం పండుగ వేడుకల్లో దళితులను దూషించిన వారిపై చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఎస్ఐ సమక్షంలోనే దళితులను కించపరుస్తూ.. నానా దుర్భాషలాడినా మౌనంగా ఉండటం సరికాదన్నారు.

వృద్ధాశ్రమాన్ని పరిరక్షించాలి

అనంతపురం అర్బన్: కూడేరు మండలం గొట్కూరు పరిధిలో ఉన్న బెరాకా వృద్ధాశ్రమాన్ని పరిరక్షించాలంటూ వృద్ధులు, నిర్వాహకులు సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు శ్రీరాములు మాట్లాడుతూ.. ఆశ్రమానికి 2009లో గొట్కూరు అటవీ ప్రాంతంలో సర్వే నంబర్ 69-4లో రెండు ఎకరాల స్థలాన్ని అప్పటి కలెక్టర్ అనుమతితో ఇచ్చారన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బొమ్మనహాళ్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయభాస్కర్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరిగే సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులందరూ హాజరు కావాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

రాయదుర్గంటౌన్: బ్రహ్మసముద్రం మండలం తీటకల్లు సమీపంలో సోమవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన గ్రామానికి చెందిన వన్నూరుస్వామి, నంద కిశోర్ రాయదుర్గంలోని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిద్దరూ గ్రామం నుంచి రాయదుర్గంలోని బంధువుల ఇంటికి వచ్చి సోమవారం మధ్యాహ్నం తిరిగి వెళ్తుండగా బైక్ అదుపు తప్పి ఈ ప్రమాదం జరిగింది.

ఎం.వెంకటంపల్లి శివాలయంలో చోరీ

కళ్యాణదుర్గం: మండలంలోని ఎం.వెంకటంపల్లి గ్రామ శివాలయంలో ఆదివారం అర్ధరాత్రి గుడి గంటలు చోరీ అయ్యాయి. ఆలయంలో భక్తులు, దాతల సహకారంతో ఏర్పాటు చేసుకున్న సుమారు ఏడు గుడి గంటలు దుండగులు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు గుర్తించారు. దీనిపై విచారణ చేస్తున్నట్లు ఏఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

నేడు టెంకాయల వేలం

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లులో ప్రముఖ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం టెంకాయల వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ నరసింహారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల ఆలయంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్, ఈఓ ఆధ్వర్యంలో టెంకాయల వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

మోడల్ స్కూల్‌లో సీట్ల భర్తీపై విచారణ చేయాలి

రాయదుర్గంటౌన్: రాయదుర్గంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో సీట్ల భర్తీపై విచారణ చేయించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు ఆధ్వర్యంలో సోమవారం మోడల్ స్కూల్ ఎదుట ధర్నా చేశారు. ఆంజనేయులు మాట్లాడుతూ కొందరు ఉపాధ్యాయులు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడినట్లు విమర్శించారు. క్షేత్రస్థాయిలో జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపించాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజు, సహాయ కార్యదర్శి తరుణ్, మున్నా, సచిన్, బాలకిరణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

చీనీ చెట్ల నరికివేతపై కేసు నమోదు

వజ్రకరూరు: మండలంలోని జరుట్లరాంపురం కొట్టాలలో శాంతిబాయి అనే మహిళా రైతు పొలంలో చీనీచెట్ల నరికివేతపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్ఐ నాగస్వామి సోమవారం తెలిపారు. ఆస్తి వివాదంలో భాగంగా చీనీచెట్లను నరికివేశారని, బాధితురాలు శాంతిబాయి ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన బీమ్లానాయక్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

రాయదుర్గం డివిజన్

9010470185, 9010567770, 9912220732